
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY




ఒక బీసీ.. ఒక మహిళ..

ఉమ్మడి జిల్లాలో సామాజిక కూర్పు!

- డీసీసీ అధ్యక్షుల ఎంపికలో సీఎం నిర్ణయమే కీలకం
- అన్నివర్గాలకు అవకాశం వచ్చేలా చర్యలు
- కసరత్తు పూర్తి చేసిన కాంగ్రెస్ అధిష్ఠానం
- రేపో, మాపో విడుదల కానున్న జాబితా
- ఆశగా ఎదురుచూస్తున్న పార్టీ శ్రేణులు, నేతలు

డీసీసీ అధ్యక్ష నియామకాలకు సంబంధించి కాంగ్రెస్ అధినాయకత్వం చేపట్టిన కసరత్తు దాదాపు పూర్తయింది. ఏఐసీసీ పరిశీలకులు కేటగిరీల వారీగా జిల్లాకు ముగ్గురేసి చొప్పున ఇచ్చిన జాబితాపై అధిష్ఠానం చర్చించి నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ సారి నియామకాల్లో సామాజిక సమీకరణాలు కీలకంగా మారనున్నాయి. పార్టీ పదవుల్లోనూ బీసీలకు, మహిళలకు పెద్దపీట వేయాలని పార్టీ నిర్ణయించింది. కాగా, ఉమ్మడి జిల్లా అధ్యక్షుల ఎంపికలో సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం కీలకం కానుంది. రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో సామాజిక సమీకరణాల్లో భాగంగా ఒక బీసీ, ఒక మహిళలకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిసింది.



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి): డీసీసీ అధ్యక్షులు ఎంపికకు పరిశీలకులుగా వచ్చిన ఏఐసీసీ నేతలు నియోజకవర్గాల వారీగా నేతలతో సమావేశాలు నిర్వహించి నివేదిక తయారు చేసిన విషయం తెలిసిందే. వికారాబాద్ జిల్లాకు మహారాష్ట్ర పీసీసీ ఉపాధ్యక్షుడు సూరజ్ ఠాకూర్, రంగారెడ్డి జిల్లాకు కేరళ ఎంపీ రాబర్ట్ బ్రూస్, మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లాకు కర్ణాటక రాష్ట్ర ఎమ్మెల్యే అంజనీ నింబాల్కర్ పరిశీలకులుగా వచ్చారు. వీరంతా స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు ఇతర ప్రజా ప్రతినిధులు, నేతలు, కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకుని కేటగిరీల వారీగా ఒక్కో జిల్లాకు ముగ్గురేసి చొప్పున పేర్లను సిఫారసు చేస్తూ నివేదిక ఇచ్చారు. దీనిపై చర్చించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి

మిగతా 7వ పేజీలో...

సీఎం నిర్ణయమే కీలకం

విశ్వసనీయ సమాచారం మేరకు రాజకీయంగా కీలకమైన రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాల్లో డీసీసీ అధ్యక్ష ఎంపికలో సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం కీలకం కానుంది. ఈ మూడు జిల్లాల విషయంలో ముఖ్యమంత్రి సిఫారసు చేసిన వారి వైపే పార్టీ నాయకత్వం మొగ్గు చూపే అవకాశాలు ఉన్నట్లు కొందరు సీనియర్ నేతలు తెలిపారు. ఇప్పటికే దీనిపై పార్టీ కీలక నేతలకు అధిష్ఠానం స్పష్టత ఇచ్చినట్లు తెలిసింది.

ఏ జిల్లాలో ఏ వర్గానికి వచ్చేనో..?

రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో సామాజిక సమీకరణాల్లో భాగంగా ఒక బీసీ, ఒక మహిళలకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిసింది. ఇందులో ఏ జిల్లాలో ఏ వర్గానికి అవకాశం దక్కుతుందనేది తెలియడం లేదు. విశ్వసనీయం సమాచారం మేరకు మేడ్చల్ జిల్లాలో ప్రస్తుతం డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న హరివర్ధన్‌రెడ్డి తనను కొనసాగించాలని కోరుతున్నారు. ప్రస్తుతం తాను ఇన్‌చార్జిగానే ఉన్నందున తనకు ఇపుడు అవకాశం కల్పించాలని పార్టీ పెద్దలను విన్నివించుకున్నారు. ఆయన విషయంలో పార్టీ నాయకత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటే రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ఒక చోట బీసీకి, మరో చోట మహిళకు అవకాశం కల్పించవచ్చని చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్త సామాజిక సమీకరణాల్లో మూడు జిల్లాల్లో ఒక చోట ఎస్సీకి కూడా అవకాశం దక్కవచ్చనే ప్రచారం జరుగుతోంది.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ఏఎంవీఐ మహ్మద్ పరహాన్ అనీఫ్



రాయికల్ టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు చేస్తున్న ఏఎంవీఐ

షాద్‌నగర్ రూరల్, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ బస్సులు నిబంధనలు పాటించపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎంవీఐ మహ్మద్ పరహాన్ అనీఫ్ హెచ్చరించారు. కర్నూలు వద్ద జరిగిన ట్రావెల్ బస్సు ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకుని రవాణా శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం షాద్‌నగర్ రవాణా శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. రాయికల్ టోల్‌ప్లాజా వద్ద నిబంధనలు పాటించని రెండు ట్రావెల్ బస్సులకు జరిమానాలు విధించినట్లు అనీఫ్ తెలిపారు. రెండు బస్సుల్లో ఫైర్ సేఫ్టీ, ప్రథమ చికిత్సకు సంబంధించిన కిట్లు లేవని తెలిపారు.

ప్రజాబాటను జయప్రదం చేయాలి

శంకర్‌పల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రజాబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శంకర్‌పల్లి విద్యుత్‌శాఖ ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో మంగళ, గురు, శనివారాలలో వారంలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా గ్రామాల్లో విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్ల వద్ద చెట్ల కొమ్మలను కత్తిరించడం, మరమ్మతులు చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

చేవెళ్లలో సీసీ కెమెరాల కంట్రోల్‌రూమ్‌ను పరిశీలిస్తున్న సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి



ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరం

- రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు
- ఫామ్‌హౌస్‌లపై ప్రత్యేక నిఘా
- సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి
- చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్ ప్రారంభం

చేవెళ్ల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి అన్నారు. శనివారం చేవెళ్ల పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అలాగే పోలీస్ స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 551 సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్‌ను రాజేంద్రనగర్ డీసీపీ యోగేష్ గౌతమ్, అడిషనల్ డీసీపీ శ్రీనివాస్‌రావు తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చేవెళ్ల ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని, వాటి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లుచెప్పారు. అత్యాశతో ఆన్‌లైన్ గేమ్‌లు ఆడి డబ్బులు పోగొట్టుకోవద్దని సూచించారు. 2024లో సైబరాబాద్ పరిధిలో మొత్తం 13 వేల సైబర్ కేసులు నమోదు కాగా, ఇందులో రూ.780 కోట్ల డబ్బులు ప్రజలు ఆన్‌లైన్‌లో మోసపోయారన్నారని పేర్కొన్నారు. ప్రజలకు అవగాహన కల్పించడంతో ప్రస్తుతం సైబర్‌మోసాల కేసులు 25శాతం తగ్గాయన్నారు. మూడేళ్లుగా హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ పెరిగిందన్నారు. రోడ్డు పనులు అనివార్య కారణాలతో ఆలస్యమవుతున్నాయన్నారు. ప్రమాదాల నివారణకు రోడ్డు మధ్యలో బోల్డ్‌గార్డులు ఏర్పాటు చేస్తామన్నారు. చేవెళ్ల పోలీసుల పనితీరు బాగుందని మెచ్చుకున్నారు. నేరాల పరిశోధనలో సీసీ కెమెరాల పాత్ర చాలా కీలకంగా పని చేస్తుందని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి తెలిపారు. చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో దాతల సహకారంతో 551 సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వీటి ద్వారా కేసులను త్వరగా ఛేదించే అవకాశం ఉంటుందన్నారు. చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్ మండలాల్లో వెయ్యికిపైగా ఫామ్‌హౌస్‌లు ఉన్నాయన్నారు. వాటిపై మరింత పోలీస్ నిఘా పెంచుతామన్నారు. కమిషనరేట్‌తోపాటు ఎస్‌వోటీ, స్థానిక పోలీస్‌లతో దాడులు నిర్వహిస్తామన్నారు. ఇటీవల మొయినాబాద్ మండలంలోని ఫామ్‌హౌస్‌లో దాడుల్లో పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేశామని గుర్తు చేశారు. పోలీస్ దాడుల్లో మైనర్ బాలురు సైతం పట్టుబడ్డారని గుర్తు చేశారు. కార్యక్రమంలో చేవెళ్ల ఏసీపీ కిషన్ గౌడ్, చేవెళ్ల సీఐ భూపాల్‌శ్రీధర్, డీఐ సీఐ ఉపేందర్, ఎస్సైలు వనం శిరీష, సంతోష్‌రెడ్డి, శిరీష, తేజశ్రీ, ఎస్సై బుగ్గయ్య ఉన్నారు.

డాక్టర్ నిర్లక్ష్యపు తీరుపై విచారణ

బాధితుల ఫిర్యాదుతో రంగంలోకి వైద్య ఉన్నతాధికారులు



ఆస్పత్రి వర్గాలను విచారిస్తున్న డీసీహెచ్ఎస్ అనురాగినిరెడ్డి

షాద్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ సుప్రజను శనివారం జిల్లా వైద్యశాఖ ఉన్నతాధికారులు విచారించారు. ఇందులో భాగంగా ఆస్పత్రిలోని సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించారు. బస్సు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లావణ్య, ఆమె సోదరుడు మిద్దెల సత్యనారాయణతో డాక్టర్ సుప్రజ నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ గురువారం వైద్య ఉన్నతాధికారులు, వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈవిషయంపై విచారణ చేపట్టి నివేదిక అందజేయాలని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ అనురాగినిరెడ్డిని కమిషనర్ ఆదేశించారు. దీంతో శనివారం ఇద్దరు వైద్యాధికారులతో కలిసి ఆమె ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విష్ణువర్ధన్, ఫిర్యాదుదారుడు మిద్దెల సత్యనారాయణ, డాక్టర్ సుప్రజను విచారించారు. ఈ నివేదికను వైద్యారోగ్య కమిషనర్‌కు అందజేస్తామని వారు తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ● ఎస్‌జీఎఫ్‌లో ప్రతిభ చాటిన క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే శంకర్

కేశంపేట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆకాంక్షించారు. మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామానికి చెందిన అన్నాచెల్లెలు లాలమోని సాయివర్షిత్, లాలమోని లాస్యనందిని గ్రామంలోని వీఏపీ పాఠశాలలో చదువుతున్నారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) అండర్-14 విభాగంలో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శనివారం షాద్‌నగర్ పట్టణంలోని తన నివాసానికి పిలుపించుకొని అభినందించారు. క్రీడలలో ఇలాగే రాణించి తల్లిదండ్రులతో పాటు కేశంపేట మండలానికి పేరు తేవాలని సూచించారు. క్రీడాకారులకు ఉద్యోగాలలో రిజర్వేషన్ ఉంటుందనే విషయాన్ని గమనించాలని సూచించారు. కార్యక్రమంలో పీఈటీ రాజన్, గ్రంథాలయ కమిటీ వైస్ చైర్మన్ నక్క బాలరాజ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగుల సంఘం ఏకగ్రీవ ఎన్నిక



తెలంగాణ బీసీ ఉద్యోగుల జిల్లా కార్యవర్గం

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం జిల్లాశాఖ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి ఏ.బాల్‌రాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. షాద్‌నగర్ పెన్షనర్స్ భవనంలో జరిగిన ఎన్నికలో జిల్లా అధ్యక్షుడిగా రాజమోని మహేశ్వర్‌ముదిరాజ్, ఉపాధ్యక్షులుగా ఎన్. భాస్కర్, చెట్ల అనిల్‌కుమార్, వెంకటేశ్వర్లు, పద్మనళిని, పులి లక్ష్మీదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సాయి మాలిక్, కార్యదర్శులుగా గోర రాఘవేందర్‌గౌడ్, భగత్, కరుణాకల్ ఎన్నికైనట్లు తెలిపారు.

ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి

శంషాబాద్ రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : అధిష్ఠానం పిలుపు మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి శనివారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. ఉదయం 10.30 గంటలకు ఎయిర్‌పోర్టు చేరుకున్న ఆయన ప్రత్యేక ఇండిగో విమానంలో బయలుదేరి వెళ్లారు. సీఎం ఎయిర్‌పోర్టుకు రావడంతో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

పత్తి అమ్మకాలకు
కపాస్ కిసాన్ యాప్
దళారుల బెడద తొలగించేందుకు అందుబాటులోకి..
మద్దతు ధర పెంచిన సీసీఐ ..
పత్తి తీత ముమ్మరం
6

భారీ వర్షం.. పంటలకు నష్టం



నందిగామ : అంతిరెడ్డిగూడలో వర్షానికి తడిసిన పత్తి పంట

ఆమనగల్లు/నందిగామ , అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. గంటపాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వానకు రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఓ వైపు ఎండ.. మరో వైపు వాన పడటంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఆమనగల్లు మార్కెట్ యార్డులో ఆరబెట్టిన మొక్క జొన్న ధాన్యం వర్షానికి తడిసి రైతులు ఇబ్బంది పడ్డారు. హైదరాబాద్, శ్రీశైలం జాతీయ రహదారిపై ఏపీజీవీబీ ఎదుట, అయ్యప్ప కొండ సమీపంలో వర్షపు నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బంది కలిగింది. గ్రామాల మట్టి రోడ్లు బురదమయంగా మారాయి. వర్షానికి పంట పొలాల్లో పత్తి తడిసి రైతులకు నష్టం కలిగించింది. నందిగామ మండలంలో శనివారం కురిసిన వర్షానికి పత్తి పంట తడిసి ముద్దయింది. మొదట్లో కురిసిన వర్షాలకు కురవడంతో పత్తి తోపాటు వరి, మొక్కజొన్న, కంది పంటలు ఏపుగా పెరిగాయి. ప్రస్తుతం పంట చేతుకొస్తుందనే సమయంలో వర్షాలు కురుస్తుండటంతో పత్తి, వరి పంటలు తడిసి నల్లబడి పోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇలాగే వర్షాలు పడితే పత్తి రైతులకు తీవ్ర నష్టం మిగిలేలా ఉంది. ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.



ఆమనగల్లు మార్కెట్‌లో తడిసిన ధాన్యం



ఆమనగల్లులో జలమయమైన రోడ్డు



చేవెళ్లలో..

నిబంధనలకు నీళ్లు

- జోరుగా తాగునీటి వ్యాపారం ● నీటి శుద్ధికేంద్రాలపై నిఘా కరువు
- నాణ్యతా ప్రమాణాలు పాటించని నిర్వాహకులు ● అపరిశుభ్ర నీటి సరఫరా
- ప్రజల ప్రాణాలతో చెలగాటం ● పట్టించుకోని అధికారులు



ఫిల్టర్ వాటర్‌ను సరఫరా చేసే వాహనం

యాచారం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో విచ్చలవిడిగా వాటర్‌ప్లాంట్లు వెలుస్తున్నాయి. నిబంధనలు పాటించకుండా నీటి శుద్ధికేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఏ ప్లాంటు వద్ద చూసినా నిర్దేశిత ప్రమాణాలు పాటించిన దాఖలాలు లేవు. నీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు చేయాలంటే రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతి తప్పక తీసుకోవాల్సి ఉంటుంది. కానీ చాలా మంది ఎలాంటి పర్మిషన్లు లేకుండానే ప్లాంట్లు ఏర్పాటు చేసి ప్రజలకు నీటిని సరఫరా చేస్తున్నారు. నీటి శుద్ధిలో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండానే వాటర్ టిన్లలో నింపి ఇంటింటికీ అందజేస్తూ ప్రజల ఆరోగ్యాలతో ఆడుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే

మిగతా 8వ పేజీలో...

అలైన్‌మెంట్ మార్చాలని కేంద్రం దృష్టికి తీసుకెళ్తా..

రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర



భూ నిర్వాసితులతో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

కడ్తాల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కడ్తాల్ మీదుగా వెళ్తున్న 765 హైటెన్షన్ విద్యుత్ లైన్ భూ నిర్వాసితులకు బీఆర్ఎస్ అన్ని విధాలుగా అండగా ఉంటుందని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. అలైన్‌మెంట్‌ను మార్పించి న్యాయం జరిగేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని ఆయన హామీ ఇచ్చారు. కడ్తాల మండల కేంద్రాన్ని అనుసరించి పంట పొలాల మీదుగా ఏర్పాటు చేస్తున్న హైటెన్షన్ విద్యుత్ లైన్ అలైన్‌మెంట్‌ను మార్చి టవర్ల నిర్మాణం పనులు నిలిపివేసేలా చూడాలని భూ నిర్వాసితులు వద్దిరాజు రవిచంద్రను కోరారు. శనివారం ఈ మేరకు కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్‌తో రవిచంద్రను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. కొందరు పారిశ్రామిక వేత్తల, రియల్టర్ల ఒత్తిడితో అలైన్‌మెంట్‌ను మార్చి సాగుచేసుకుంటున్న పంట పొలాల మీదుగా విద్యుత్ లైన్ వేస్తున్నారని బాధితులు వాపోయారు. ఎలాంటి అనుమతులులేకుండా, రైతుల సమ్మతి తీసుకోకుండా టవర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని భూ నిర్వాసితులు విచారం వ్యక్తం చేశారు. అలైన్‌మెంట్ మార్పు గురించి కొన్ని నెలలుగా పాలక ప్రజాప్రతినిధులు, పవర్ గ్రిడ్ అధికారులపై ఒత్తిడి తెస్తున్నా, రిలే దీక్షలు చేపట్టినా స్పందన లేదన్నారు. దీంతో స్పందించిన రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి వద్దకు వెళ్లి సమస్యను వివరిద్దామని తెలిపారు. అలైన్‌మెంట్ మార్పునకు బీఆర్‌ఎస్ పార్టీ పరంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని ఆయన హామీ ఇచ్చారు. అవసరమైతే న్యాయపరంగా పోరాడుతామని తెలిపారు. అలైన్‌మెంట్‌ను మార్చే వరకు భూ నిర్వాసితులకు అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భూ నిర్వాసితులు పర్వత్‌కుమార్ యాదవ్, శివరామకృష్ణ, సత్యనారాయణ, పిప్పళ్ల వెంకటేశ్, కడారి రామకృష్ణ పాల్గొన్నారు.

పత్తి అమ్మకాలకు కపాస్ కిసాన్ యాప్

దళారుల బెడద తొలగించేందుకు యాప్

మద్దతు ధర పెంచిన సీసీఐ ● పత్తి తీత ముమ్మరం



పత్తి రైతుతో మాట్లాడి సమస్య తెలుసుకుంటున్న ఏవో రవినాథ్

యాచారం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పత్తి రైతులను దళారుల బెడద నుంచి కాపాడేందుకు కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ గత నెల 2న కపాస్ కిసాన్ యాప్‌ను ప్రారంభించారు. పత్తి సేకరణ డిజిటలైజేషన్ కోసం యాప్‌ను రూపొందించారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పత్తి అమ్మకాల్లో మధ్య వర్తుల ప్రమేయాన్ని నివారించేందుకు ఈ చర్యలు తీసుకుంది. రైతులు తమ స్మార్ట్ ఫోన్లలో యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలి. యాప్ లో అడిగిన వివరాలన్నీ ఫిల్ చేయాలి. పత్తిని అమ్మదల్చుకున్న మార్కెట్ వివరాలను నమోదు చేయాలి. కపాస్ కిసాన్‌యాప్ అమ్మకానికి స్లాట్ బుక్ చేసుకోవాలి. ఆధార్ కార్డుకు లింకున్న మొబైల్ నంబర్‌తోనే యాప్‌లో వివరాలు నమోదు చేయాలి. ఓటీపీతో లావాదేవీని పూర్తి చేయాలి. రైతుకు కనీస మద్దతు ధర లభిస్తుంది. యాప్‌లో నమోదు చేసుకున్న రైతులు మాత్రమే సీసీఐ కేంద్రాల్లో అమ్మే వీలుంటుంది.

యాప్‌తో పారదర్శకత

రైతులు తమకవసరమైన సమయానికి వారికి అనుకూలంగా ఉన్న సీసీఐ కేంద్రంలో పత్తి విక్రయించుకునేందుకు స్లాట్ బుక్ చేసుకోవచ్చు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లకు పాటిస్తున్నట్టుగానే ఈ స్లాట్ బుక్ విధానం ఉంటుంది. రైతులు తమ విక్రయాల వివరాలను, చెల్లింపు స్థితిని యాప్‌లో ట్రాక్ చేసుకోవచ్చు. దళారులతో పని లేకుండా రైతులు నేరుగా పత్తి అమ్ముకునేలా ఈ విధానం పనిచేస్తుంది. ఎలాంటి మధ్య వర్తి ప్రయేయం ఉండదు. రైతులు తమ ఇబ్బందులను అధికారుల దృష్టికి తెచ్చేందుకు 18005995779 అనే టోల్ ఫ్రీ నంబర్ తెచ్చారు. అలాగే వాట్సాప్ 88972 81111 నంబర్ ఇచ్చారు. పత్తిలో తేమ శాతం 8 కంటే తక్కువ ఉంటే క్వింటా రూ.8,110, తేమ 10శాతం ఉంటే రూ.7,947, అలాగే 11శాతం ఉంటే రూ.7866. తేమ 12శాతం ఉంటే రూ.7,785 చెల్లిస్తారు.

అందుబాటులో ఉన్న కాటన్ మిల్లులివే...

నందిగామలోని తిరుమల ట్రేడింగ్ కంపెనీ, హరిహర జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ కంపెనీ, తుల్జా భవానీ కాటన్ మిల్, ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లిలోని ఎస్బీటీ కాటన్ ఇండస్ట్రీస్, కిసాన్ జిన్నింగ్ ఇండస్ట్రీస్, ఇదే మండలం పోలెపల్లిలోని అహోషేక్ కాటన్ మిల్స్, తలకొండపల్లిలోని శ్రీనివాస మురుగన్ ఇండస్ట్రీస్‌లో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాల ద్వారా పత్తి కొనుగోళ్లు సాగిస్తామని అధికారుల తెలిపారు.

కపాస్ కిసాన్ యాప్‌పై రైతులకు చెబుతున్నాం



కపాస్ కిసాన్ యాప్‌పై ఏవో, ఏఈవోలతో గ్రామాలకు వెళ్లి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రైతులను దళారుల బెడద నుంచి కాపాడేందుకు యాప్ ప్రయోజనాన్ని వివరిస్తున్నాం. యాప్‌ను రైతుల స్మార్ట్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేసి పత్తి విక్రయించేందుకు స్లాట్ బుక్ చేసే విధానంపై చెబుతున్నాం. రైతులు తమ పత్తిని సీసీఐ కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలి. వ్యాపారులకు తక్కువ రేటుకు అమ్మొద్దు. ఇబ్బందులుంటే మండల కేంద్రాల్లో ఏవోఏఈవోలకు చెప్పి సమస్య తీర్చుకోవాలి.

- డి.ఉష, జిల్లా వ్యవసాయాధికారి



పూర్తిగా పాడైన బషీరాబాద్‌లోని పంచాయతీ రోడ్డు

వామ్మో.. ఈ రోడ్డుపై వెళ్లేదెలా?

● బషీరాబాద్‌లో పూర్తిగా ధ్వంసమైన దారి

● నిత్యం వాహనదారుల ఇబ్బందులు

బషీరాబాద్, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ వద్ద ప్రధాన రోడ్డు ఇప్పట్లో బాగుపడేలా లేదని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు. గుర్తుకు వచ్చినప్పుడల్లా కాంట్రాక్టర్ రోడ్డు పనులను చేస్తూ, ఆ తర్వాత పట్టించుకోపోవడంతో స్థానిక ప్రజల రోడ్డు కష్టాలు వర్ణనాతీంగా ఉన్నాయి. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్డంతా చిత్తడిగా మారడంతో వాహనదారులు పడరాని పాట్లు పడుతున్నారు. కొంత కాలంగా ఈ రోడ్డుపై వాహనదారులు రాకపోకలను మానేసినా, స్థానిక ప్రజలకు మాత్రం కాలినడక ఇక్కట్లు తప్పడంలేదు. ఈ మార్గంలో సీసీ రోడ్డును నిర్మించాల్సి ఉన్నా పనులు సాగడంలేదు. బషీరాబాద్ నుంచి జీవన్గి మీదుగా కరణ్‌కోట్ వరకు గల మార్గాన్ని అభివృద్ధి పర్చేందుకు రూ.30కోట్లు మంజూరైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బషీరాబాద్ పంచాయతీ వద్ద ప్రధాన మార్గాన్ని సీసీ నిర్మాణం చేపట్టేందుకు ఎక్స్‌కవేటర్‌తో తవ్వి, మొరం పోసి వదిలేశారు. దీంతో వాహనదారుల కష్టాలు మొదలయ్యాయి. ఈ సీసీ రోడ్డు పనులు ప్రారంభమయ్యేదెన్నడో? మా రోడ్డు కష్టాలు తీరేదెన్నడో నని స్థానిక ప్రజలు రకరకాలుగా చర్చించుకుంటున్నారు.

ఆమనగల్లు పట్టణంలో ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగింపజేస్తున్న మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్

ఆమనగల్లు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రహదారులపై ఆక్రమణల తొలగింపునకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. శనివారం మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి మున్సిపాలటీ పరిధి మాడ్గుల రోడ్డులో ఉన్న ఆక్రమణలను తొలగించారు. జాతీయ రహదారిపై ఉన్న ఆక్రణలు కూడ వ్యాపారులు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని ఈ సందర్భంగా కమిషనర్ ఆదేశించారు. అలా చేయకుంటే సివిల్ పోలీసు, ట్రాఫిక్ పోలీసుల సహకారంతో వాటిని కూడా తొలగిస్తామని పేర్కొన్నారు. ఆక్రమణల తొలగిపునకు ప్రజలు సహకరించాలని శంకర్ నాయక్ కోరారు. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించే వ్యాపారులపై మున్సిపల్ చట్టం -2019 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. రోడ్లు వెడల్పుగా ఉంటే వాహనదారులకు సమస్యలు తలెత్తవని, రోడ్డును ఎవరూ ఆక్రమించొద్దని ఆదేశించారు.

బీసీలకు న్యాయం జరిగే వరకు పోరాడతాం

షాబాద్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు వచ్చే వరకు సంఘటితంగా పోరాడుతామని బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు అన్నారు. షాబాద్‌లో అంబేడ్కర్ చౌరస్తాలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే నిరహార దీక్ష శనివారం 14వ రోజుకు చేరింది. ఈ దీక్షకు షాబాద్ గౌడ సంఘం నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. 40 సంవత్సరాలుగా బీసీలకు అన్యాయం చేస్తూ అణగదొక్కుతున్నారన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు న్యాయమైనవని, అన్ని పార్టీలు మద్దతు తెలపాలన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు వచ్చే వరకు రిలే నిరాహార దీక్షలు విరమించేంది లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు రాజేందర్ గౌడ్, రవీందర్, శ్రీనివాస్‌గౌడ్, రమేష్‌యాదవ్, వెంకటేష్‌గౌడ్, నర్సింహులు, గడ్డం చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్ష చేస్తున్న బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు

విద్యార్థులు ఉద్యోగాలను సృష్టించాలి

● ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ నరేష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఓయూ రిజిస్ట్రార్ నరేష్‌రెడ్డి

కీసర రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉద్యోగాలు చేసే స్థాయి నుంచి సృష్టించే స్థాయికి ఎదగాలని ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ నరేష్‌రెడ్డి అన్నారు. శనివారం రాంపల్లిలోని కేజీఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, మేనేజ్‌మెంట్ కళాశాల నూతన విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం(ఆత్మీయ ఆహ్వానం) నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రస్తుత అవసరాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా, ఉద్యోగాలు సృష్టించే వారిగా ఎదగాలన్నారు. కాలేజీ చైర్మన్ గోవింద్‌రెడ్డి మాట్లాడుతూ.. కళాశాల వ్యవస్థాపక లక్ష్యం, ఉద్యోగాల కల్పనకు చేస్తున్న ప్రయత్నాలను వివరించారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ బిజినెస్ ఎక్సలెన్స్ మార్కెటింగ్ ప్రొఫెసర్ ఎం.అనిల్, డైరెక్టర్ ప్రొఫెసర్ రమణారావు, ప్రిన్స్‌పాల్ విజయలక్ష్మి, ప్రొఫెసర్లు నితిన్‌రెడ్డి, సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

నక్షబాట తీసి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలి

● ఆర్డీవో, తహసీల్దార్లకు బాచుపల్లి వాసుల వినతి



ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డికి వినతి పత్రమిస్తున్న గ్రామస్తులు

కందుకూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కబ్జా చేసిన నక్షబాటను గుర్తించి తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని బాచుపల్లి గ్రామస్తులు శనివారం ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ కె.గోపాల్‌లకు వినతిపత్రం ఇచ్చారు. జైత్వారం మాజీ ఎంపీటీసీ జి.సురేష్ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చి మాట్లాడారు. కందుకూరు రెవెన్యూ(కొత్తగూడ) గ్రామం నుంచి పెరుగుగూడ మీదుగా బాచుపల్లి గ్రామం వరకు ఉన్న నక్షబాటను మద్దుల లక్ష్మారెడ్డి(శ్రీకాంత్) అనే పౌల్ట్రీఫాం యజమాని కబ్జా చేశాడన్నారు. ఆక్రమణలో నక్షబాటను గుర్తించకుంటే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని సురేష్ తెలిపారు. గ్రామస్తులతో ఆర్డీవో మాట్లాడుతూ.. నక్షబాట ఏ సర్వే నంబర్లలో ఉందో త్వరలో ఏడీతో సర్వే చేసి నక్షబాటను గుర్తిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు కొంతం అంజిరెడ్డి, మద్దెల శ్రీశైలం, నరేష్, వై.రాజు, శేఖర్‌గుప్తా, కృష్ణయాదవ్, రమేశ్ ఎం.రవి, ఎం.అశోక్, పి.చెన్నయ్య, యాదగిరిగౌడ్, కె.మధుసుదన్‌రెడ్డి, అనంత్, ఇ.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తాండూరు వాసికి ఎంపీడీవో ఉద్యోగం

● మంత్రి నుంచి నియామక పత్రం స్వీకరణ



సీతక్క నుంచి ఎంపీడీవోగా నియామక పత్రం అందుకుంటున్న క్రాంతి

తాండూరు,అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1లో ఎంపీడీవో ఉద్యోగం పొందిన తాండూరు వాసి క్రాంతి రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, ఆ శాఖ డైరెక్టర్ సృజన నుంచి శనివారం అపాయింట్‌మెంట్ ఆర్డర్ స్వీకరించారు. 15రోజుల పాటు రాజేంద్రనగర్‌లోని తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెవలప్ సెంటర్‌లో శిక్షణ పొంది నారాయణపేట్ జిల్లా కొస్గి ఎంపీడీవోగా నియామకం అయ్యారు. సోమవారం నుంచి విధుల్లో చేరతారు. క్రాంతి తాండూరులో పుట్టిపెరిగి విద్యాభ్యాసం కొనసాగించి ఉద్యోగం సాధించడం పట్ల అతడి తల్లిదండ్రులు టీచర్ బాలమణి, న్యాయవాది గోపాల్ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

ప్రకృతితో మమేకమయ్యేవారు యాదవులు

ఘట్‌కేసర్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రకృతితో మమేకమై జీవనం సాగించేవారు యాదవులని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం రాత్రి పోచారం మున్సిపాలిటీ పరిధి మక్తలో కొత్త బాల్‌రాజ్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ సమ్మేళనం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ హాజరయ్యారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ... జంతువులను ప్రేమిస్తూ వాటితోనే జీవనం సాగించేవారు యాదవులని అన్నారు. శ్రీకృష్ణ పరమాత్ముడు చూపిన మార్గంలో యాదవ సమాజం ముందుకు వెళ్లడం అభినందనీయమన్నారు. అనేక సంవత్సరాలుగా యాదవులు సదర్ వేడుకలు నిర్వహిస్తున్నారని ఎంపీ గుర్తు చేశారు. వేడుక సందర్భంగా దున్నపోతులను సుందరంగా అలంకరించారు. అనంతరం వాటితో విన్యాసాలు చేయించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, బాలేశ్, బస్వారాజ్, సుదర్శన్, యాదవ సంఘం సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.



సదర్ వేడుకల్లో దున్నలను చూస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

ప్రజా సమస్యలను పరిష్కరిస్తా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యాదయ్య

శంకర్‌పల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషిచేస్తానని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. శంకర్‌పల్లిలోని డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల సమస్యలపై ఆయన శనివారం అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. శంకర్‌పల్లి-పటాన్‌చెరు మొయిన్‌రోడ్డు నుంచి డబుల్‌బెడ్‌రూం ఇళ్ల వరకు సీసీ రోడ్డుకు నిధులు మంజూరు అయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. వీధిలైట్లు ఏర్పాటుతో పాటు రేషన్‌దుకాణం సైతం ఇక్కడే ఏర్పాటయ్యేలా చూస్తానని ఆయన లబ్ధిదారులకు హామీ ఇచ్చారు. శ్మశాన వాటికకు స్థలం, రెండు అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు, బస్తీ దవాఖానా మంజూరయ్యే విధంగా చూడాలని లబ్ధిదారులు కోరారు. ఎమ్మెల్యే కలెక్టర్ నారాయణరెడ్డికి ఫోన్‌చేసి లబ్ధిదారుల సమస్యలపై మాట్లాడారు. ప్రజల సమస్యలు వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకిచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ, తహసీల్దార్ సురేందర్, మున్సిపల్ కమిషనర్ యోగేష్. నాయకులు గోపాల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

విద్యార్థినితో అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై విచారణ



ఉపాధ్యాయుడిపై విచారణ జరుపుతున్న ఎంఈవో వెంకటయ్య

తాండూరు రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కరన్‌కోట్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఓ విద్యార్థినితో అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై ఎంఈవో విచారణ జరిపారు. కరన్‌కోట్ జెడ్పీ పాఠశాల విద్యార్థినిపై టీచర్ రాఘవేందర్‌రెడ్డి ఇటీవల అసభ్యకరంగా ప్రవర్తించడంతో అతడిపై విద్యార్థిని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎంఈవో వెంకటయ్య పాఠశాలను సందర్శించి వివరాలు సేకరించారు. విద్యార్థినిపై సైన్స్ ఉపాధ్యాయుడు రాఘవేందర్‌రెడ్డి మూడునాలుగు సార్లు తన బండి ఎక్కాలని, ఇంటి వద్ద దించుతానని తనతో అన్నట్లు విద్యార్థిని ఎంఈవోకు తెలిపింది. ఇంతకు ముందు రెండుసార్లు ఇదే విషయంపై టీచర్‌ను మందలించినా అతడి తీరు మారలేదని బాలిక తల్లిదండ్రులు తెలిపారని ఎంఈవో చెప్పారు. హెచ్ఎం హేమలత ఉపాధ్యాయునికి వార్నింగ్ ఇచ్చినట్లు కూడా ఎంఈవో తెలిపారు. విచారణ నివేదికను శనివారం డీఈవోకు పంపినట్లు ఎంఈవో తెలిపారు.

అధికార లాంఛనాలతో జవాన్ అంత్యక్రియలు



గాలిలోకి కాల్పులు జరుపుతున్న ఆర్మీ సిబ్బంది



పాడె మోస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

నవాబుపేట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతిచెందిన ఆర్మీ జవాన్ మోముల వెంకట్‌రామ్‌రెడ్డి(28) అంత్యక్రియలు ఆర్మీ అధికార లాంఛనాలతో శనివారం వట్టిమీనపల్లిలో నిర్వహించారు. వెంకట్‌రామ్‌రెడ్డి మృతదేహంపై ఉంచిన జాతీయ జెండాను తీసి తండ్రి మోహన్‌రెడ్డికి ఆర్మీ అధికారి అందజేశారు. వెంకట్‌రామ్‌రెడ్డికి భార్య మనీషా, తల్లి సావిత్రమ్మ, తండ్రి ఉన్నారు. అంత్యక్రియల్లో చేవేళ్ల ఎమ్మెల్యే యాదయ్య పాల్గొని జవాన్ వెంకట్‌రామ్‌రెడ్డి పాడె మోశారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ రామ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, పలువురు మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు. ఆర్మీ అధికారి ఆనంద్‌సింగ్ ఆధ్వర్యంలో జూనియర్ కమిషన్ అధికారి అరవింద్‌కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో 20మందికిపైగా ఆర్మీ సిబ్బంది పాల్గొన్ని అంత్యక్రియలు ముగించారు.

వీర జవాన్లకు ఘన నివాళి

శంషాబాద్ రూరల్, అక్టోబర్ 25(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన వీర జవాన్లకు శనివారం ఢిల్లీ చాణక్యపురిలోని నేషనల్ ఆకాడమీలో డైరెక్టర్ జనరల్ ప్రవీర్ రంజన్, అదనపు డైరెక్టర్ జనరల్ బినితా ఠాకూర్, సీనియర్ సీఐఎస్ఎఫ్ అధికారులు పుష్పగుచ్ఛాలు పెట్టి నివాళులు అర్పించారు. అమరుల కుటుంబీకులకు శాలువాలు సన్మానించారు. వాల్ ఆఫ్ వారియర్, పోలీస్ మ్యూజియాన్ని సందర్శించారు. అనంతరం వీర జవాన్లపై రుపొందించిన సీఐఎస్ఎఫ్ డాక్యుమెంటరీని ప్రదర్శించారు. అధికారులు మాట్లాడుతూ.. వారు దేశానికి చేసిన సేవ మరిచి పోలేనిదని చెప్పారు. కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ సిబ్బంది, 200మంది కుటుంబీకులు పాల్గొన్నారు.



వీరజవాన్ల కుటుంబాలతో సీఐఎస్ఎఫ్ అధికారులు

ఒక బీసీ.. ఒక మహిళ!

(ఐదో పేజీ తరువాయి)

మీనాక్షీ నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శనివారం ఢిల్లీ వెళ్లారు.

42శాతానికి తగ్గకుండా..

తాజా సమాచారం ప్రకారం డీసీసీ అధ్యక్షుల జాబితాను అధిష్ఠానం దాదాపు ఖరారు చేసినట్లు తెలుస్తోంది. రేపో మాపో జాబితా విడుదల చేయనున్నట్లు సమాచారం. అయితే ఈ సారి నియామకాల్లో సామాజిక సమీకరణాలు కీలకంగా మారనున్నాయి. పార్టీ పదవుల్లోనూ బీసీలకు, మహిళలకు పెద్దపీట వేయాలని పార్టీ నిర్ణయించింది. ఇప్పటికే బీసీలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అయితే ఈ నిర్ణయంపై న్యాయస్థానం స్టే ఇచ్చి ఎన్నికలు నోటిఫికేషన్‌ను కూడా రద్దు చేసిన సంగతి విదితమే. ఇదే సమయంలో పార్టీ పదవుల నియామకాల్లో కూడా సామాజిక కూర్పు పాటించాలని అధినాయకత్వం నిర్ణయించింది. డీసీసీ నియమాకాల్లో బీసీలకు పెద్దపీట వేస్తూ 42 శాతానికి తగ్గకుండా పదవులు ఇవ్వాలని నిర్ణయించినట్లు ప్రచారం సాగుతోంది. అదే విధంగా మహిళలకు కూడా ప్రాధాన్యత పెంచాలని అధిష్ఠానం భావిస్తోంది. 60 ఏళ్ల లోపు వారికే పగ్గాలు అప్పగించాలని పార్టీ నిర్ణయించినట్లు తెలిసింది. ఇదిలా ఉంటే ఎమ్మెల్యేలు తమ ప్రాంతంలో వారికి డీసీసీ పదవి దక్కకుండా జాగ్రత్త పడుతున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన నేతలకు ఎమ్మెల్యేలు మద్దతు తెలుపుతూ వారి పేర్లు సిఫారసు చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు
ఇసుక గండం

- సకాలంలో లభించక పనుల ఆలస్యం

బషీరాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారుల గోస వర్ణనాతీతంగా మారింది. ఇంటి నిర్మాణానికి ఇసుక దొరకక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆశించిన స్థాయిలో ఇళ్ల నిర్మాణాలు పుంజుకోవడం లేదు. బషీరాబాద్ మండల వ్యాప్తంగా కాశీంపూర్ పంచాయతీ పైలట్ గ్రామాన్ని కలుపుకుని 950 వరకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. ఆయా గ్రామాల్లో 5 నుంచి 10ఇళ్ల వరకు నిర్మాణాలు కొనసాగుతుండగా లబ్ధిదారులకు ఇసుక కొరత పట్టిపీడిస్తోంది. గ్రామాల్లో చాలా వరకు ఇళ్లను బేస్మెంట్ వరకు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ఇతర పనులకు ఇసుక దొరకడంలేదు. ఒకవేళ దొరికినా ఒక్కో ట్రాక్టర్‌కు రూ.5వేల వరకు చెల్లించాల్సి వస్తుందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా కాగ్నా నది పరీవాహక ప్రాంత గ్రామాలైన ఇందర్‌చెడ్, నవాంద్గి, క్యాద్గిర, జీవన్గి, మంతట్టి శివారుల్లో ఇసుక ఉన్న ఇందిరమ్మ ఇళ్లకు అంతగా ఉపయోగపడటంలేదు. ఆయా గ్రామాల పరిధిలో రెవెన్యూ అధికారులు ఇసుక అనుమతులు ఇచ్చిన, స్థానిక ప్రజలు ఇతర గ్రామాలకు తీసుకెళ్లనివ్వకపోవడంతో నిత్యం ఏదో ఒకచోట ఘర్షణలు సాధారణం



కాశీంపూర్‌లో ఇసుక కొరతతో నిలిచిన నిర్మాణం

అయ్యాయి. ఈ క్రమంలో లబ్ధిదారులకు ఇసుక దొరకక నిర్మాణాలు నిలిచిపోతున్నాయి. ఇందిరమ్మ ఇళ్లకు ఉచితంగా ఇసుక ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోక పడరాని పాట్లు పడాల్సివస్తుందని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు వాపోతున్నారు. ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక కోసం ఇటీవల కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ, మైన్స్, ఆర్అండ్‌బీ అధికారులు బషీరాబాద్ మండలానికి వచ్చారు. ఆయా గ్రామాల్లో ఇసుక రీచ్ పాయింట్లను గుర్తించి కలెక్టర్‌కు నివేదిస్తామని చెప్పివెళ్లారు. ఇసుక విషయమై నేటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని, తమకు ఇసుక కష్టాలు తొలగడంలేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక తరలింపునకు ఎక్కడి నుంచైనా అనుమతులిస్తే బాగుంటుందని కోరుతున్నారు. ఏదేమైనా ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కొరతతో చివరకు నిర్మాణాలు ఆలస్యమవుతున్నాయి.

వృత్తి నైపుణ్య శిక్షణకు
ఏటీసీ

- శామీర్‌పేటలో టాటా టెక్నాలజీస్ సహకారంతో ఏర్పాటు
- ఏడాది, రెండేళ్ల టెక్నికల్ కోర్సులు
- 172 మంది విద్యార్థులకు అడ్మిషన్లు
- నిష్ణాతులైన ఏడుగురు ఇన్‌స్ట్రక్టర్లు



శామీర్‌పేటలో ఏర్పాటు చేసిన ఏటీసీ కేంద్రం

శామీర్‌పేట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం టాటా టెక్నాలజీస్ సంస్థ సహకారంతో ప్రారంభించిన సాంకేతిక వృత్తి నైపుణ్య శిక్షణ గ్రామీణ విద్యార్థులకు వరంగా మారాయి. శిక్షణ పూర్తైన విద్యార్థులకు పరిశ్రమల్లో ఉద్యోగాలు లభిస్తాయి. ప్రభుత్వం అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)ను శామీర్‌పేటలో ప్రారంభించింది.

రూ.5కోట్లతో ఏటీసీ కేంద్రం ఏర్పాటు

శామీర్‌పేటలోని ప్రభుత్వం ఐటీఐ క్యాంపస్‌లో టాటా టెక్నాలజీస్ సంస్థ రూ.5కోట్లతో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పిస్తూ పెద్ద షెడ్డు, మిషన్లను, ఇతర సాంకేతిక పరికరాలు, క్లాస్ రూమ్‌లతో గత సెప్టెంబరులో ఏటీసీని ఏర్పాటు చేసింది. ఏటీసీని గత నెల 27న మేడ్చల్ కలెక్టర్ మనుచౌదరి లాంఛనంగా ప్రాంభించారు.

దత్తత తీసుకున్న టాటా సంస్థ

శామీర్‌పేటలో టాటా టెక్నాలజీస్ సంస్థ ఏటీసీ కేంద్రాన్ని నిర్మించి ఏడుగురు ఇన్‌స్ట్రక్టర్లకు నియమించి విద్యార్థులకు సాంకేతిక శిక్షణను ఇప్పిస్తోంది. ఈ ఏటీసీ కేంద్రాన్ని టాటా సంస్థ ఐదేళ్ల దత్తత తీసుకుంది. శిక్షకులకు సంస్థ జీతాలు చెల్లిస్తుంది. సెంటర్ మెయింటెనెన్స్ చూసుకుంటుంది.



ఏటీసీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మేడ్చల్ కలెక్టర్ మనుచౌదరి(ఫైల్)

ఆరు కోర్సులతో ఏటీసీ ప్రారంభం

శామీర్‌పేట ఏటీసీలో ప్రభుత్వం ఆరు రకాల ఉపాధి వృత్తి సాంకేతిక కోర్సులను ప్రవేశపెట్టింది.

- ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యాన్యుఫాక్చరింగ్ టెక్నీషియన్ కోర్సు. ఇందులో చేరేందుకు టెన్త్ పాస్ అర్హత. ఇది ఏడాది కోర్సు.
- మ్యాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్ టెక్నీషియన్ కోర్సు ఇది ఏడాది కోర్సు.

3). ఇంజనీరింగ్ డిజైన్ టెక్నీషియన్ కోర్సు. ఇది కూడా ఏడాది కోర్సు.

- వర్చువల్ అనాలిసిస్ అండ్ డిజైనర్ ఫేమ్. ఇది రెండేళ్ల కోర్సు.
- సీఎన్‌సీ మంచింగ్ టెక్నీషియన్ కోర్సు ఇది రెండేళ్ల కోర్సు.
- మెకానికల్ ఎలక్ట్రికల్ వెహికిల్ కోర్సు. ఇది రెండేళ్ల కోర్సు. అన్ని కోర్సులకు పదో తరగతి పాస్ కనీస అర్హత. విద్యార్థులకు ప్రతి సెప్టెంబరు నెలలో ప్రభుత్వం అడ్మిషన్లు కల్పిస్తుంది.



విద్యార్థులకు వృత్తి విద్య శిక్షణ ఇస్తున్న ఇన్‌స్ట్రక్టర్

అర్థమయ్యే విధంగా నేర్పుతున్నారు



శామీర్‌పేట ఏటీసీ కేంద్రంలో టీచర్లు మాకు అర్థమయ్యే విధంగా సాంకేతిక వృత్తి కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. ఈ ఏటీసీ కేంద్రంలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు బాగున్నాయి.

- సమీర్, కేశవరం, ఏటీసీ ఫస్టియర్

శిక్షణ సంతృప్తికరంగా ఉంది



శామీర్‌పేటలో ప్రభుత్వం గత సెప్టెంబరులో ప్రారంభించిన ఏటీసీలో ఇస్తున్న సాంకేతిక ఉపాధి వృత్తి విద్య సంతృప్తి కరంగా ఉంది. ఈ ఏటీసీలో వృత్తి శిక్షణ విద్య పట్ల ప్రిన్సిపల్ లలిత, టీఓ రవీందర్‌ల ప్రోత్సాహం బాగుంది. మాకు శిక్షణ పూర్తయిన వెంటనే గుర్తింపు పొందిన పరిశ్రమల్లో ఉద్యోగం సాధించే అవకాశం ఉంది. నేటి కాలానికి అనుగుణంగా టెక్నికల్ కోర్సులు నేర్పుతున్నారు.

- కె.విశ్వనాథ్, కొక్కొండ కొల్తూర్, ఫస్టియర్

ఉపాధి కల్పించేందుకే ఏటీసీలు



గ్రామీణ విద్యార్థులకు ఆధునిక సాంకేంతిక ఉపాధి వృత్తి నైపుణ్యంలో శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం శామీర్‌పేటలో ఏటీసీ కేంద్రాన్ని ప్రారంభించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ఏటీసీ కేంద్రంలో మేము వివిధ టెక్నికల్ కోర్సుల్లో మొదటి సంవత్సరంలో 172 మంది విద్యార్థులకు అడ్మిషన్లను కల్పించాం. వారికి ఉత్తమ శిక్షకులతో అధునాత సాంకేతిక వృత్తి నైపుణ్యాలపై శిక్షణ ఇప్పిస్తున్నాం.

- వి.లలిత, ప్రిన్సిపాల్, శామీర్‌పేట ఏటీసీ

172 మంది విద్యార్థులకు అడ్మిషన్

శామీర్‌పేట ఏటీసీలో ప్రిన్సిపాల్ లలిత ఆధ్వర్యంలో 172 మంది బాలబాలికలకు అడ్మిషన్లు కల్పించేందుకు గత సెప్టెంబరులో నోటిఫికేషన్ ఇచ్చారు. విద్యార్థులు ఆహ్లాదకర వాతావరణంలో అడ్వాన్స్‌డ్ సాంకేతిక ఉపాధి నైపుణ్య శిక్షణ పొందుతున్నారు. కోర్సులు పూర్తి చేసేలోపే విద్యార్థులకు టాటా టెక్నాలజీస్ వారే తమ పరిశ్రమల్లో ఉద్యోగం ఇస్తారు. శామీర్‌పేట ఏటీసీ, ఐటీఐలకు లలితనే ప్రిన్సిపల్‌గా నియమించారు. ఏటీసీ, ఐటీఐ రెండింటికి శిక్షణ అధికారిగా(టీవో)గా రవీందర్ కొనసాగుతున్నారు.

ఆధునికి పద్ధతుల్లో వృత్తి నైపుణ్య శిక్షణ



శామీర్‌పేటలోని ఏటీసీ కేంద్రంలో విద్యార్థులకు సులభంగా అర్థమైయ్యే పద్ధతుల్లో వివిధ సాంకేతిక వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నాం. ఏటీసీ కేంద్రానికి విద్యార్థులకు ప్రతిరోజూ హాజరవుతూ.. టెక్నికల్ విద్య కోర్సులను సంతోషంగా నేర్చుకుంటున్నారు. వారు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకుంటున్నారు.

- రాజ్‌బాబు, ఏటీసీ ఇన్‌స్ట్రక్టర్

కాలంచెల్లిన పార్టీలుగా కాంగ్రెస్, బీజేపీ

మహేశ్వరం, ఆంధ్రజ్యోతి 25 (ఆంధ్రజ్యోతి): మహేశ్వరంలో కాలం చెల్లిన పార్టీలుగా కాంగ్రెస్, బీజేపీలు మిగిలిపోతాయని, ప్రజలకిచ్చిన హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి. సబితారెడ్డి అన్నారు. శనివారం మహేశ్వరానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కర్రోళ్ల చంద్రయ్య ఆధ్వర్యంలో పలువురు నాయకులు సబితారెడ్డి నగరంలోని ఆమె నివాసంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. అధికారం ఉంది కదా అని కాంగ్రెస్ నాయకులు ఉలికి పడితే ఇక్కడ ఊరుకునేది లేదన్నారు. కాంగ్రెస్ నాయకులు ఎన్ని ఎత్తులు వేసినా



బీఆర్ఎస్‌లో చేరిన నాయకులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం ఎప్పటికీ బీఆర్ఎస్ అడ్డానే అన్నారు. ప్రజలను, రైతులను అనేక విధాల మోసం చేసింది చాలక కేసీఆర్‌ను టార్గెట్ చేస్తున్న కాంగ్రెస్ మొదట ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చూపిస్తామన్నారు. మహేశ్వరం మండల రైతులకు మొదట్లో రైతుభరోసా రాకుండా చేసిన కాంగ్రెస్ నాయకులను ప్రజలు తరిమికొట్టే రోజులు దూరంలో లేవన్నారు. ఎవరికి ఏ ఆపదొచ్చినా సమస్య పరిష్కారానికి తాను సిద్ధంగా ఉంటానన్నారు. తుక్కుగూడ కేంద్రంగా కొందరు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌ను అణచేయాలని చూస్తున్నారని, వారెన్ని ఎత్తులు వేసినా సబితారెడ్డిని ఏమీ చేయలేరని అన్నారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేయాలని నాయకులకు సూచించారు. ఇక్కడ కాంగ్రెస్ కనుమరుగు ఖాయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మునగపాటి నవీన్, కృష్ణ, శ్రీశైలం, నాగేష్, మల్లేష్, శ్రీనివాస్, పెంటయ్య పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

కడ్తాల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పురాతన ఆలయాల పునరుద్ధరణ, పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కడ్తాల్ మండలం కానుగుబాయి తండాలో నిర్మించిన తుల్జా భవానీ ఆలయాన్ని శనివారం ఆయన సందర్శించి భవానీ మాతకు పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు, డీసీసీ ప్రధాన కార్యదర్శి నెనావత్ బిక్యనాయక్.. కసిరెడ్డిని ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కానుగుబాయి తండా గిరిజనులు ఐక్యంగా ఉంటూ తండాను అభివృద్ధి చేసుకోవడం, తుల్జాభవానీ ఆలయాన్ని నిర్మించుకోవడం అభినందనీయం అన్నారు. తండా అభివృద్ధికి ప్రభుత్వపరంగా తన వంతు తోడ్పాటు అందిస్తానని తెలిపారు. అర్హులైన గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తోందన్నారు. ఫోర్త్ సిటీకి చేరువలో ఉన్న కడ్తాల్ ప్రాంతం వేగవంతంగా అభివృద్ధి సాధిస్తుందన్నారు. పరిశ్రమల ఏర్పాటు ద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ చేగురి వెంకటేశ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యనాయక్, నాయకులు పాండు, మోత్యా నాయక్, లక్పతి నాయక్, జహంగీర్ అలీ, రాంచందర్ నాయక్, కృష్ణ, రాజు, రతన్, నర్సింగ్, లచ్చు నాయక్, జానియా నాయక్, రియా, దేవుల తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నారాయణరెడ్డిని సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

ఆమనగల్లు: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారానికి కల్వకుర్తి నియోజకవర్గం నుంచి శనివారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఎమ్మెల్యే నారాయణరెడ్డికి ఏడు పోలింగ్ బూత్‌లు కేటాయించారు. కడ్తాల్, ఆమనగల్లు, తలకొండపల్లి, మాడ్గుల మండలాల నాయకులు ఎమ్మెల్యేతో ప్రచారంలో తిరిగారు. యూసుఫ్‌గూడ డివిజన్‌లో ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్లీ రాములు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, నాయకులు ఆనంద్, గుర్రం కేశవులు, వెంకటేశ్, శ్రీకాంత్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, లక్పతినాయక్, శ్రీశైలం, వెంకట్‌రెడ్డి, దళపతిగౌడ్, రవికాంత్‌గౌడ్, విజయ్, శ్రీకాంత్, రమేశ్, పాండు ఉన్నారు.



ప్రచారంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, కాంగ్రెస్ నాయకులు

మూన్ వాకర్ వంశీకృష్ణపై డాక్యుమెంటరీ



వంశీకృష్ణ

తాండూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ వీఐపీ, మున్ వాకర్ వంశీకృష్ణపై జాతీయ మీడియా చానల్ ఇండియా టీవీ డాక్యుమెంటరీ షూటింగ్ పూర్తిచేసినట్లు తెలి సింది. నవంబరు 1న ఇండియా టీవీలో డాక్యుమెంటరీ ప్రసారం కానుందని వంశీకృష్ణ చెప్పారు. తాండూరుకు చెందిన వంశీకృష్ణ మూన్‌వాకింగ్‌లో 2016లో ఇండియ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించి ఆదరణ పొందారు. 2017లో ఢిల్లీలోని సిరిఫుట్ ఆడిటోరియంలో వివిధ దేశాల రికార్డుల ప్రతినిధులతో అంతర్జాతీ య వీఐపీ హోదా పొందారు. 2019 లో ఫాస్టెస్ట్ ర్యాప్ సింగింగ్ ఏకధాటిగా పాడి రికార్డు సాధించారు. 2021లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన 5 నిమిషాల 19 సెకన్ల పాటు గరుడాసన యోగ చేసి రికార్డు సృష్టించారు. ఇటీవల ఫాస్టెస్ట్ డబుల్ నాంచకు(కరాటే ఆయుధం) నిమిషం లో 218సార్లు తిప్పి రికార్డు సృష్టించిన సందర్భంగా ప్రముఖ చానల్ ఇండియా టీవీ ప్రత్యేక డాక్యుమెంటరీ కోసం వంశీని ఆహ్వానించారు. వంశీ తన జీవిత విశేషాలను డాక్యుమెంటరీలో పొందుపర్చనున్నారు.



మెడికల్ కళాశాలలో విద్యార్థులకు మెమొంటో అందజేస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి

వైద్యులు ప్రత్యక్ష దైవాలు

- ప్రభుత్వ విప్ మహేందర్‌రెడ్డి

చేవెళ్ల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వైద్యుడు ఎప్పుడూ పరిశోధకుడేన్న విషయం గుర్తుంచుకుని ప్రజలకు వైద్యాన్ని అందించాలని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ మహేందర్‌రెడ్డి సూచించారు. చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాలలో మూడు రోజుల పాటు సాగిన అధ్యాయ-2025 ముగింపు కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. వైద్యులు కన్పించే దేవుళ్లు అని అన్నారు. కరోనా లాంటి మహమ్మారితోపాటు అనేక వ్యాధులు మానవళిని భయపెట్టి వైద్యరంగానికి సవాళ్ల విసురుతున్నాయన్నారు. వైద్యుడు నిరంతర పరిశోధకుడు అన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. వైద్యవృత్తి పవిత్రమైందన్నారు. మంచి వైద్యులుగా చదువుకొని ప్రజలకు వైద్యం అందించాలని సూచించారు. అంతకుముందు క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు మెమెంటోలు అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జోయారాణి, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రావు, వైద్యులు, అధ్యాపకులు ఉన్నారు.

నిబంధనలు పాటించని
రెడీమిక్స్ వాహనాలకు జరిమానా



రెడీమిక్స్ లారీకి జరిమానా విధిస్తున్న మున్సిపల్ అధికారులు

శామీర్‌పేట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి):నిబంధనలు పాటించకుండా సిమెంట్, కంకరను రవాణా చేస్తున్న రెడీమిక్స్ వాహనాలకు శనివారం మున్సిపల్ అధికారులు జరిమానా విధించారు. మూడుచింతలపల్లిలో ఆర్అండ్‌బీ రోడ్లపై సిమెంట్, కాంక్రీట్‌ను రెడీమిక్స్ వాహనాలు రవాణా చేస్తున్నాయి. కాగా రవాణా సమయంలో రెడీమిక్స్ వాహనాల్లోంచి కాంక్రీట్ రోడ్డుపై పడుతూ వాహనదారులకు ప్రమాదకరంగా మారుతోంది. మూడుచింతలపల్లి పరిధిలో ఈ వాహనాల నుంచి ప్రధాన రోడ్లపై పడిన కాంక్రీట్‌తో ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. ద్విచక్ర వాహనదారులు ఎంతో మంది పడిపోయారు. ఈ ప్రమాదాల పట్ల స్థానికులు మూడుచింతలపల్లి మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో అధికారులు శనివారం రోడ్డు ప్రమాదాలకు కారణమైన రెడీమిక్స్ వాహనాలకు రూ.20వేల జరిమానా విధించారు.

అబ్బో.. వాహనం ఎంత పొడవో!

కొడంగల్ రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పెద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో 138టైర్లు కలిగిన భారీ వాహనం శనివారం కొడంగల్ అంబేడ్కర్ చౌరస్తా మీదుగా కర్ణాటక వైపు వెళ్లింది. ఈ భారీ వాహనం కొడంగల్ పట్టణం దాటే వరకు విద్యుత్ తీగలు తగలకుండా వాహన సిబ్బంది చర్యలు తీసుకున్నారు. వాహనం నెమ్మదిగా వెళ్లడంతో పట్టణంలో ట్రాఫిక్ జామ్ అయ్యింది.



కొడంగల్‌లో భారీ ట్రాన్స్‌ఫార్మర్‌తో వెళుతున్న వాహనం



కమిషనర్ యోగేశ్‌కు చిత్రపటం అందిస్తున్న ఆలయ చైర్మన్ గోపాల్‌రెడ్డి

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి : కమిషనర్

శంకర్‌పల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ యోగేష్ తెలిపారు. చందిప్పలోని మరకత శివాలయాన్ని శనివారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని, మరకత శివలింగాన్ని దర్శించుకోవడం అదృష్టమని తెలిపారు. అనంతరం ఆలయ చైర్మన్ గోపాల్‌రెడ్డి కమిషనర్‌ను శాలువాతో సన్మానించారు. ఆలయ చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు సాయిశివ తీర్థప్రసాదాలు అందజేశారు.

శరవేగంగా ఎంపీడీవో భవన నిర్మాణం

- త్వరలో అందుబాటులోకి కార్యాలయం
- ఎమ్మెల్యే శంకర్ చొరవతో నిధులు మంజూరు

నందిగామ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎంపీడీవో భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 2020లో మండల పరిషత్ నూతన భవన నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అప్పటి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డిలు భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. నిధులు కేటాయించకపోవడంతో భవన నిర్మాణ పనులు మొదటిదశలోనే నిలిచిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత.. ప్రస్తుత ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో 2024లో ఎస్డీఎఫ్ నిధులు రూ.కోటి కేటాయించడంతో భవన నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. మొదటి అంతస్తు పనులు దాదాపుగా పూర్తికావడంతో పాటు రెండో అంతస్తు నిర్మాణ పనులు కూడా తుదిదశకు చేరుకున్నాయి. మొదటి అంతస్తు భవనంలో మండల పరిషత్ అధ్యక్షులు, ఎంపీడీవో, ఈవోపీఆర్డీ, ఎంపీవోలకు వేర్వేరుగా గదులు నిర్మించడంతో పాటు మెయిన్ హాలులో ఏవో, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్లు విధులు నిర్వహించేలా నిర్మాణాలు చేపడుతున్నారు. రెండో అంతస్తులో సభలు, సమావేశాలు, మిగిలిన అధికారులకు గదులు ఏర్పాటు చేసేవిధంగా భవన నిర్మాణం చేపట్టినట్లు అధికారులు తెలిపారు. అర్ధాంతరంగా ఆగిపోయిన మండల పరిషత్ భవన నిర్మాణానికి ప్రత్యేక చొరవతో రూ.కోటి కేటాయించి, భవన నిర్మాణం పనులు శరవేగంగా ముందుకు తీసుకెళ్తున్న షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ఈ సందర్భంగా మండల ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



పనులు పూర్తికావొచ్చిన ఎంపీడీవో భవనం

నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేస్తాం

ఎంపీడీవో భవన నిర్మాణం పనులు త్వరలో పూర్తి చేస్తాం. ఇప్పటికే మొదటి అంతస్తు పనులు పూర్తయ్యాయి. రెండో అంతస్తు పనులు దాదాపుగా తుదిదశకు చేరాయి. త్వరలోనే భవన నిర్మాణం పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొస్తాం.

- హేమంత్, పంచాయతీరాజ్ శాఖ ఏఈ

ఎమ్మెల్యే సహకారంతో చకచకా పనులు



ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతోనే భవన నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయి. ప్రత్యేక చొరవతో నిధులు కేటాయించి మండల అభివృద్ధికి కృషిచేస్తున్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలు పూర్తిచేసి అందుబాటులోకి తెస్తాం.

- ఎం.శివశంకర్‌గౌడ్, మాజీ ఎంపీపీ, కొత్తూరు

క్రైం కార్నర్

బైక్‌ను ఢీకొన్న స్కూల్ బస్సు.. యువకుడి మృతి



వినోద్(ఫైల్)

ఆదిభట్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని ఓ ప్రైవేటు స్కూల్ బస్సు ఢీకొన్న ఘటనలో యువకుడు మృతిచెందిన ఘటన ఆదిభట్ల పోలీసుస్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం నర్సింగ్‌రావుపల్లికి చెందిన బండారి **వినోద్(22)** ఫొటో గ్రాఫర్. హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్‌లో ఉంటున్నాడు. ఈక్రమంలో శనివారం తుక్కుగూడ ఓ ఈవెంట్ ఉండడంతో తన ద్విచక్ర వాహనంపై బొంగ్లూర్ నుంచి అవుటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డు మీదుగా రావిర్యాల వైపు వెళ్తున్నాడు. అయితే, అదే సమయంలో తుక్కుగూడ నుంచి బొంగ్లూర్ వైపు వస్తున్న ఓ ప్రైవేటు స్కూల్ బస్సు.. వినోద్ ద్విచక్ర వాహనాన్ని రావిర్యాల వండర్‌లా వద్ద ఢీకొంది. దాంతో వినోద్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈమేరకు స్కూల్ బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

తాళం వేసిన ఇంటికి కన్నం

- 6 గ్రాముల బంగారు ఉంగరం, 20 తులాల వెండి గొలుసుల చోరీ

తలకొండపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చుక్కాపూర్ గ్రామానికి చెందిన కల్లు రాజేందర్‌రెడ్డి ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బంధువుల ఇంట్లో గృహప్రవేశం కోసం శుక్రవారం రాజేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లారు. శనివారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా.. తాళం పగలగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా బీరువా తలుపులు కూడా తెరిచి ఉన్నాయి. అందులో ఉన్న ఆరు గ్రాముల బంగారు ఉంగరం, 20 తులాల వెండి గొలుసులు అపహరణకు గురయ్యాయి. చోరీ జరిగిన ఇంటిని ఎస్సై శ్రీకాంత్ పరిశీలించారు. ఈ మేరకు రాజేందర్‌రెడ్డి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లైంగిక దాడి.. యువకుడిపై పోక్సో కేసు

శంషాబాద్ రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మండలంలోని పిల్లోనిగూడ గ్రామంలో ఈ నెల 18న గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలిక పట్ల అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. షాబాద్ మండలం మద్దూర్ గ్రామానికి చెందిన నవీన్ 18న పిల్లోనిగూడలో ఓ బాలికపై లైంగికదాడికి పాల్పడి పరారయ్యాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శనివారం శంషాబాద్ మండలంలోని పాలమాకులలో అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపర్చగా జ్యుడీషియల్ రిమాండ్ విధించి చంచల్‌గూడ జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

హక్కుల సాధనకు సంఘటితంగా ముందుకు సాగాలి



ఐక్యత చాటుతున్న నాయకులు, గీత కార్మికులు

కడ్తాల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి గీత కార్మికులు సంఘటితంగా ముందుకు సాగాలని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోయపల్లి సుధాకర్‌గౌడ్ పిలుపునిచ్చారు. కార్మికులకు ఇవ్వాల్సిన ఎక్స్‌గ్రేషియా, పింఛన్లు, బైకులు, సేఫ్టీ మోకులను ప్రభుత్వం వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. కడ్తాల మండలం ముద్విన్ గ్రామంలో శనివారం కల్లుగీత కార్మిక సంఘం సమావేశం నిర్వహించారు. సుధాకర్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గీత కార్మికుల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం మండల కన్వీనర్ పట్నం నర్సింహగౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నర్సింహగౌడ్‌కు సంఘం నాయకులు నియామక పత్రాన్ని అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా సుధాకర్‌గౌడ్ మాట్లాడుతూ సంఘటిత పోరాటాల ద్వారానే సమస్యల పరిష్కారం సాధ్యమన్నారు. గీత వృత్తి రక్షణకు ప్రభుత్వాలు తోడ్పాటునందించాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు యాదయ్య, పట్నం కృష్ణయ్యగౌడ్, సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య, ప్రజా సంఘాల నాయకులు పెంటయ్య, ముద్విన్ సొసైటీ డైరెక్టర్లు జంగం శ్రీను, యాదయ్య, సోషల్ మీడియా కన్వీనర్ నవీన్, శివ, ఈశ్వరయ్య, మల్లేశ్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

పంటల వివరాలు నమోదు చేయించుకోవాలి

చేవెళ్ల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రైతులు పంటల సాగు వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని చేవెళ్ల మండల హార్టికల్చర్ అధికారి కీర్తి ప్రకటనలో పేర్కొన్నారు. పంటలు వేసుకోవడం ఎంత ముఖ్యమో.. వాటి వివరాల నమోదు కూడా అంతే ముఖ్యమన్నారు. వరి, పత్తి, జొన్న, కందులు, ఇతర పంటల సాగు వివరాలను వ్యవసాయ శాఖ కార్యాలయంలో నమోదు చేయించాలని సూచించారు. చాలామంది రైతులు పంటల వివారాలను నమోదు చేసుకోవడం లేదని పేర్కొన్నారు.

పాషా, నరహరిల వర్ధంతిని ఘనంగా నిర్వహించాలి

కందుకూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మతోన్మాదులు, భూస్వాములు, గూండాల దాడిలో మరణించిన కామ్రేడ్ పాషా, నరహరిల 36వ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ కోరారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. నేడు(ఆదివారం) ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో నిర్వహించనున్న వర్ధంతి సభకు మండలం నుంచి పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు.

కాశీనాథ్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం



కాశీనాథ్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాయకులు

కడ్తాల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కాశీనాథ్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. జీవిత కాలంలో చేసిన మంచి పనులు మరణాంతరం కీర్తించబడతాయన్నారు. కడ్తాల్ మండలం ముద్విన్ గ్రామానికి చెందిన పీఏసీఎస్ మాజీ డైరెక్టర్, విశ్రాంత ఈవో శ్రీపాతి కాశీనాథ్‌రెడ్డి సంతాప కార్యక్రమం ముద్విన్ గ్రామంలోని ఓ ఫంక్షన్ హాలులో శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక నేతలతో కలిసి కాశీనాథ్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ముద్విన్ గ్రామ అభివృద్ధికి ఆయన అందించిన సేవలను కసిరెడ్డి కొనియాడారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి సూదిని రాంరెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ, పీఏసీఎస్ డైరెక్టర్ చేగురి వెంకటేశ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బిచ్యానాయక్, నాయకులు లక్పతినాయక్, మోత్య నాయక్, జహంగీర్ అలీ, రాంచంద్ర నాయక్, సుమన్ గౌడ్, మల్లేశ్ గౌడ్, మహేందర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, సురేందర్ రెడ్డి, వెంకటేశ్వరరావు, మానయ్య, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలి

షాబాద్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని లింగారెడ్డిగూడ, సాయిరెడ్డిగూడ గ్రామస్తులు కోరారు. ఈమేరకు శనివారం నగరంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి లింగారెడ్డిగూడ, సాయిరెడ్డిగూడ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. బస్సులు లేక విద్యార్థులు, వృద్ధులు, వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రేషన్ సరుకుల కోసం నాందార్‌ఖాన్‌పేట్‌కు పోవాల్సి వస్తుందని వివరించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. మాజీ సర్పంచ్ గౌండ్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ జయమ్మ వెంకట్‌రెడ్డి, గ్రామస్తులు శేఖర్‌రెడ్డి, మల్లారెడ్డి, పెంటారెడ్డి, లింగం, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, విఠల్, ఎల్లేశ్ తదితరులు ఉన్నారు.



షాబాద్ : మధుసూదన్‌రెడ్డిని కలిసిన లింగారెడ్డిగూడ, సాయిరెడ్డిగూడ గ్రామస్తులు



యాచారం : మేడిపల్లిలో బస్సు ఎక్కడానికి పోటీ పడుతున్న విద్యార్థులు

సరిపడా బస్సులు నడపాలి

యాచారం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): అవసరాలకు తగ్గట్టు బస్సు సర్వీసులు నడపాలని ప్రజలు కోరుతున్నారు. సరిపడా బస్సులు లేకపోవడంతో రైతులు, విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని తాటిపర్తి నుంచి మేడిపల్లి, యాచారం మీదుగా ఇబ్రహీంపట్నం వరకు ఉదయం పూట రెండు అదనపు బస్సులు నడపాలని విద్యార్థులు, రైతులు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇదే విషయమై ఇబ్రహీంపట్నం డిపో అధికారులకు విన్నవించినట్లు వారు తెలిపారు. ఈమేరకు ఆర్ఎం, డీవీఎంలకు వినతిపత్రాలందించినా అదనపు బస్సులు నడపడం లేదని విద్యార్థులు చెబుతున్నారు. పల్లెచెల్కతండా నుంచి యాచారం మీదుగా ఇబ్రహీంపట్నం వరకు, తాటిపర్తి నుంచి మేడిపల్లి, యాచారం మీదుగా ఇబ్రహీంపట్నం వరకు బస్సు సర్వీసులు నడపాలని కోరుతున్నారు. అలాగే ఇబ్రహీంపట్నం నుంచి మధ్యాహ్నం మూడున్నర గంటలకు బస్సు బయల్దేరి పల్లెచెల్కతండా వరకు వెళ్లేలా చూడాలని తండావాసులు కోరుతున్నారు.

ఘనంగా సదర్ ఉత్సవాలు



సదర్ ఉత్సవాల్లో ప్రజాప్రతినిధులు

చేవెళ్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని దామరిగిద్ద గ్రామంలో శుక్రవారం రాత్రి సదర్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ఆసక్తిగా దున్నపోతుల సయ్యాట, విన్యాసాలను తిలకించారు. చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు బండారి ఆగిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు మధుసూదన్‌గుప్తా, గ్రామస్తులు, నాయకులు తదితరులున్నారు.

'జనం బాట'కు తరలిన నాయకులు



జనం బాట కార్యక్రమానికి తరలిన పాండురంగారెడ్డి, తదితరులు

కందుకూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సామాజిక తెలంగాణ, సమన్యాయం కోసం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తలపెట్టిన జాగృతి జనంబాట కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా నేతలు తరలివెళ్లారు. శనివారం మొదటిరోజున నిజామాబాదు జిల్లాలో ప్రారంభించిన జనంబాటకు రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు జాగృతి సంస్థ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పాండురంగారెడ్డి మాట్లాడుతూ ఉద్యమకారులకు ఊపిరిగా, బడుగులకు బాసటగా, ఆదివాసులకు, అమరుల కుటుంబాలకు అండగా, నిరుద్యోగులకు మద్దతుగా, సామాజిక న్యాయమే లక్ష్యంగా జనాన్ని జాగృతి చేయడం కోసం తమ అధినేత్రి కవిత జనంబాట చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వాల వైఫల్యాలను ఎత్తిచూపడం కోసం తలపెట్టిన జనంబాటలో భాగంగా మేధావులతో సమాలోచన చేసి ప్రజలతో మమేకమయ్యే ఈ కార్యక్రమం తెలంగాణ రాష్ట్రానికి నూతన ఒరవడిని తీసుకువస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆ సంస్థ రాష్ట్ర నాయకులు కోల శ్రీనివాస్, ముస్తఫా, రామ్‌కోటి, లావణ్య, వర్ష, రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు బండారి లావణ్య, నాయకులు బాలాజీ. ఉదయ్, ఉండెల బాబురావు, రాము యాదవ్, నవీన్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందిస్తున్న కోడూరి రమేశ్

ఆదిభట్ల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ఎఫ్ పేదలకు వరంలాటిందని, అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులకు ఆర్థిక భరోసానిస్తుందని కాంగ్రెస్ పార్టీ ఇబ్రహీంపట్నం వర్కింగ్ ప్రెసిడెంట్ కోడూరి రమేశ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని తులేకలాన్‌కు చెందిన సామ అలివేలుకు మంజూరైన రూ.60 వేలు, ఎర్గాగి మహేందర్‌కు రూ.16 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా వైద్యంపరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో మెరుగైన చికిత్స కొరకు సీఎంఆర్ఎఫ్ ఎంతగానో తోడ్పాటునందిస్తుందన్నారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో నియోజకవర్గంలో ఎంతోమంది పేదలకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేస్తున్నట్లు చెప్పారు. సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సత్తు శశాంక్ రెడ్డి, బండ శ్రీశైలం, జంగయ్య, మహేందర్, శ్రీనివాస్‌రెడ్డి, రామయ్య, యాదగిరి, విజయ్, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దాతల చేయూత అభినందనీయం

షాబాద్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): దాతల చేయూత అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు మర్పల్లి అశోక్ అన్నారు. ద బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా సహకారంతో శనివారం మండల పరిధిలోని మన్‌మర్రి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్టేషనరీ అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతల చేయూత అభినందనీయమని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటమ్మ, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ వెంకటేష్, ద బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రతినిధులు, విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్టేషనరీ అందజేస్తున్న ద బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా బృందం

వైద్యశిబిరం విజయవంతం

కొందుర్గు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కొందుర్గు మండల పరిధిలోని ఉమ్మెంత్యాల గ్రామంలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చందులాల్ రాథోడ్ మాట్లాడుతూ పేద ప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు నాణ్యమైన వైద్యం చేయించుకోవాలని సూచించారు. శిబిరంలో 256 మందికి బీపీ, షుగర్, బ్లడ్ టెస్టులు, 60 మందికి ఈసీజీ చేశారు. అదేవిధంగా 10 మందికి గుండె సంబంధిత సమస్యలు ఉన్నాయని గుర్తించినట్లు తెలిపారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. హెల్త్ క్యాంపులో రాఘవేందర్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, అనెగాళ్ల ఆనంద్, రాంచంద్రయ్య, మల్లేశ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ చందులాల్

(ఐదో పేజీ తరువాయి)

నిబంధనలకు నీళ్లు

ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాలో 300కు పైచిలుకు వాటర్ ప్లాంట్లు ఉన్నట్లు అధికారుల లెక్కల ప్రకారం తెలిసింది. ఏటేటా ఈ సంఖ్య పెరుగుతుంది. అయితే కొందరు వ్యాపారులు మాత్రమే ప్రభుత్వ నిబంధనల మేరకు మున్సిపల్, గ్రామపంచాయతీల నుంచి అనుమతి పొంది నీటిశుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. మిగతావారు తమ ఇష్టానుసారం ప్లాంట్లు ఏర్పాటు చేసి నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా మధ్యతరగతి నుంచి సంపన్నుల వరకు మినరల్ వాటర్ అంటూ నీటిని సరఫరా చేస్తున్నారు. నీటిలో పరిమితికి మించి లవణాలు ఉంటే తక్షణం జీర్ణవ్యవస్థపై ప్రభావం చూపుతుంది. భవిష్యత్తులో ఎముకల సంబంధిత వ్యాధులకు గురయ్యే ప్రమాదముంది. శుద్ధి యంత్రంలో ఉండే ఫిల్టర్స్‌ను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీ చేయాల్సి ఉంటుంది. కానీ క్షేత్రస్థాయిలో ఇవేవి జరుగుతున్న దాఖలాలు లేవు.



యాచారం మండలం నానక్‌నగర్‌లోని వాటర్ ఫిల్టర్

అనుమతులు తప్పనిసరి..

మున్సిపాలిటీ, గ్రామాలలో నీటిశుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. దరఖాస్తు చేసే సమయంలో ప్లాంటు ఏర్పాటు చేసే భవనానికి గ్రామ పంచాయతీ అనుమతి తప్పక ఉండాలి. పరిసర కాలనీ ప్రజలకు ఇబ్బంది లేదని నిరభ్యంతర ధ్రువపత్రం సమర్పించాలి. చిన్నపరిశ్రమలశాఖ వద్ద నమోదు చేసుకోవాలి. నీటి సరఫరా కోసం వినియోగించే ప్లాస్టిక్ క్యాన్లు, ప్యాకెట్లు విక్రయిస్తే ప్లాస్టిక్ కవర్ల నాణ్యతను విధిగా పంచాయతీ అధికారులు పరీక్షించాలి. వాటర్ ప్లాంటులో శుద్ధికి ఉపయోగించే మైక్రోఫిల్టర్, కార్బన్, ఇసుకఫిల్టర్‌ను మార్చాల్సి ఉంటుంది. వీటితో పాటు రికార్డుల నిర్వహణ, పరీక్షల విడిభాగాలు మార్చడం, తదితర ఖర్చులు ఏటా రూ.8 లక్షల నుంచి రూ.10లక్షల వరకు అవుతుందని ప్లాంటు నిర్వాహకులు చెబుతున్నారు. అయితే ఈ ఖర్చు అంతా ఎవరు భరిస్తారు అని కొందరు తూతూ మంత్రంగా ప్లాంట్లను నిర్వహిస్తూ శుద్ధికాని నీటిని ప్రజలకు సరఫరా చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వాటర్ ప్లాంట్లపై దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

నిర్వాహకులు పన్నులు చెల్లిస్తున్నారు



వాటర్‌ఫిల్టర్ నిర్వాహకులు గ్రామపంచాయతీకి పన్నులు చెల్లిస్తున్నారు. తమ సిబ్బంది తరచూ వాటిని తనిఖీ చేస్తున్నారు. జనాలకు నాణ్యమైన నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పన్ను చెల్లించని వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నాం.

- శ్రీలత, ఎంపీవో, యాచారం

తెలంగాణ జాగృతి విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడిగా చిర్ర మహేశ్



కేశంపేట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి విద్యార్థి విభాగం షాద్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడిగా కేశంపేట మండలం వేములనర్వ గ్రామానికి చెందిన చిర్ర మహేశ్‌ను నియమించారు. ఈమేరకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకంతో షాద్‌నగర్ నియోజకవర్గ బాధ్యతలు అప్పగించినందుకు మహేశ్ కవితకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని ఆయన తెలిపారు.

పనితీరు, సేవతోనే ప్రజల్లో కీర్తి



వినోదను సన్మానిస్తున్న కిషన్‌రెడ్డి

ఆమనగల్లు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పనితీరు, సేవలను బట్టే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రజల్లో కీర్తి లభిస్తుందని ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భట్టు కిషన్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు ఎంపీవోగా విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన వినోదకు శనివారం వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కిషన్‌రెడ్డి, డీపీవో సురేశ్, లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ సందడి నరేందర్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వినోదను అధికారులు, ఉద్యోగులు నాయకులు, కుటుంబసభ్యులు పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. మాజీ సర్పంచ్ అనురాధ, గౌర్రె రవీందర్‌రెడ్డి, గోవర్దన్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, మధుసూధన్‌రెడ్డి, గోవింద్‌రెడ్డి, శోభ తదితరులున్నారు.